నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, బుధవారం 8 జనవరి 2025 | VIKARABAD



పత్రికా ప్రకటనను విడుదల చేస్తున్న రైతులు, సమన్వయకర్తలు

## ప్రజాపాలనంటే.. జనం గొంతు నొక్కడమేనా..?

**శాంతియుతంగా చేస్తున్న ఆందోళనపై ఆంక్షలెందుకు..?**

**గత ప్రభుత్వంలోని లేని అనుమతులు ఇప్పుడెందుకు..?**

**ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ రైతుల ఆవేదన..**

రంగారెడ్డి, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలనంటే జనం గొంతు నొక్కడమేనా అని యాచారం మండలంలోని ఫార్మాసిటీ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములు తమకే ఇవ్వాలని, నిషేధిత జాబితా నుంచి తొలగించి, ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులతో కొట్టించడం ప్రభుత్వానికి తగదని ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి ఆటంకం లేకుండా ఎటువంటి అల్లర్లు, సమస్యలు సృష్టించడానికి వెళ్లకుండా శాంతియుతంగా ఫార్మా అనుబంధ గ్రామాలైన నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మేడిపల్లి గ్రామాల్లో ఆందోళన చేస్తుండగా, పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బ్యానర్లతో గ్రామాల్లో తిరుగవద్దంటూ ఆంక్షలు విధించడమే కాకుండా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి కేసులు పెడతామని భయపెట్టడం తగదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు, పాదయాత్రలు చేసినప్పటికీ ఇబ్బంది పెట్టలేదన్నారు. గతంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేశారని, ముఖ్యమంత్రిని కూడా.. నువ్వు ముఖ్యమంత్రివా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేసి భూములు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో మేడిపల్లి గ్రామంలో కోర్టు స్టే ఉన్న భూముల్లో టీఎస్‌ఐఐసీ వారు పని చేస్తున్నారని, స్టే కాపీలు తీసుకెళ్లి చూపించగా పనులు నిలిపివేశారన్నారు. అప్పుడు కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి స్వయంగా వచ్చి సహకరించారని, పోలీసులు కూడా స్టే ఆర్డర్ కాపీ చూపిస్తే సహకరించారన్నారు. కానీ, ఆగస్టు నెలలో కుర్మిద్ద గ్రామంలో కోర్టు స్టేకు వ్యతిరేకంగా టీఎస్‌ఐఐసీ అధికారులు మట్టి పరీక్షలు చేస్తుంటే పోలీసులు టీఎస్‌ఐఐసీకి సహకారమందించి రైతులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఫార్మాసిటీ వ్యతిరేక కమిటీ సమన్వయకర్తలు కౌల సర్వతి, కుందారపు నారాయణ, యాచారం మండలంలోని ఫార్మాసిటీ బాధితులు భగవంత్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, అచ్చిరెడ్డి, విశాల్‌రెడ్డి, జక్కుల వెంకటేశ్, జంగయ్య, సాయిరెడ్డి, యాదయ్య, పాండు తదితరులు ఉన్నారు.

**కోర్టును ఆశ్రయిస్తాం : కౌల సరస్వతి..**

ఫార్మా పేరుతో బలవంతంగా భూములు లాక్కోవడం కోసం ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని, రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నదని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కౌల సరస్వతి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఆయా రైతులకు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు నేడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, రైతులకు పూర్తి హక్కు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ప్లాట్లు ఇచ్చే రైతుల జాబితాలు గ్రామపంచాయతీల్లో.



కందుకూరు, జనవరి 7 : ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇచ్చేందుకు వారి జాబితాలను ఆయా గ్రామ పంచాయతీల్లో ఉంచుతున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్, ఆకులమైలారం, అన్నోజిగూడ, బేగరికంచ, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి భూములను సేకరించిందని తెలిపారు. ఎకరానికి గుంట, 131 గజాల చొప్పున ప్లాట్లను ఇవ్వడానికి వారి పేర్లను గ్రామ పంచాయతీ బోర్డుల్లో బుధవారం నుంచి ఉంచుతామని, అభ్యంతరం ఉన్నట్లయితే వారం రోజుల్లో ఆర్డీవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

## రాయిని చెరువును పరిశీలించిన హైడ్రా



రాయిని చెరువును పరిశీలిస్తున్న హైడ్రా, ఇరిగేషన్ అధికారులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 7: మున్సిపాలిటీ పరిధి పసుమాములలోని రాయిని చెరువును ఆక్రమించారన్న ఫిర్యాదుతో మంగళవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొందరు చేపల పెంపకాన్ని చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై పరిశీలనకు వచ్చారు. రాయిని చెరువు హద్దులను హైడ్రా నుంచి వచ్చిన విచారణ అధికారి బాచిరెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీధర్ పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తామని చెప్పారు. ఎక్కడైనా కబ్జాలు చేస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



**కాగ్నా పరీవాహక ప్రాంతం, శివసాగర్ నుంచి రాత్రికి రాత్రే ఇసుక తరలింపు**

**యాలాల, తాండూరు, బషీరాబాద్, ధారూరు మండలాల్లో జోరుగా ఇసుక దందా**

**తాండూరు మండలం ఖంజాపూర్, పాత తాండూరులలోనూ..**

**ప్రభుత్వ భవనాల నిర్మాణాల పేరిట సాగుతున్న తంతు..!**

**ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేలు వసూలు చేస్తున్నారని పోలీసులపై ఆరోపణలు**

**చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలపై ఆరోపణలు**

# కాగ్నాను తోడేస్తుండ్రు..

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

*'జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది.. ప్రధానమైన కాగ్నా నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు.. రాత్రికి రాత్రే ఇసుక దంపులను మాయం చేస్తున్నారు..' అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యాలాల, తాండూరు మండలాల్లోనే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, ఒక్క యాలాల మండలంలోనే లక్షల క్యూబిక్ మీటర్లలో కాగ్నా నుంచి ఇసుకను రాత్రంతా అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాలాల మండలంలోని కాగ్నా నుంచి 40 ట్రాక్టర్లతో, తాండూరు మండలంలోని ఖంజాపూర్, పాత తాండూరు ప్రాంతాల నుంచి సుమారు 20 ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఏకంగా పోలీసులే దగ్గరుండి ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 నుంచి 4 వేలు వసూలు చేస్తూ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులే అండగా ఉండడంపై జిల్లావాసులు భగ్గుమంటున్నారు. నిఘా పెట్టి అడ్డుకోవాల్సిన గనులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఇసుక మాఫియా ఇచ్చే మామూళ్ల మత్తులో ఉండి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే అనుచరుల అండతోనే ఇసుక దందా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది.*

*- వికారాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ)*

**మామూళ్ల మత్తులో అధికారులు..**

జిల్లాలో ఇసుక మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని, యాలాల మండలంతోపాటు తాండూరు, బషీరాబాద్, ధారూరు మండలాల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నదని జిల్లావాసులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి రాత్రికిరాత్రే ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలంలోని కాగ్నా పరీవాహక ప్రాంతంతోపాటు శివసాగర్‌లో ఇసుక వనరులు ఉండగా, ఏటా రూ.కోట్ల ఇసుక లభ్యమవుతున్నట్లు సమాచారం. జిల్లాలోని కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో ఫిల్టర్ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతున్నదని, మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు నెలనెలా మామూళ్ల మత్తులో మునుగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బషీరాబాద్ మండలం కాగ్నా పరీవాహక ప్రాంతంలోని మంతటి, రెడ్డి ఘణాపూర్, ఎక్మయి, మైల్వార్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక దందా సాగుతున్నదని, ఇసుక మాఫియాపై నిఘా పెట్టాల్సిన అధికారులు అండగా నిలువడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పేరిట యథేచ్ఛగా ఇసుక దందా సాగుతుండగా తాండూరులో నర్సింగ్ కాలేజీ, తాండూరు మార్కెట్ కమిటీ గోదాంల నిర్మాణానికి అనుమతులు పొందిన వారు వాటి పేరుపై రాత్రి సమయాల్లోనూ ఇసుకను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అనుచరుల అండతోనే ఇసుక దందా సాగుతున్నదని, దీంతో పోలీసు, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది.

**తనిఖీలు చేయలేదు..**

**మాకు వేరే పనులున్నాయి..**

జిల్లాలో ఇసుక అక్రమ దందా సాగుతున్నట్లు పత్రికల్లో చూశా. మేం ఇప్పటి వరకు ఎక్కడా తనిఖీలు నిర్వహించలేదు. మాకు వేరే పనులున్నాయి.. ఇసుక మాఫియాపై ఎలా నిఘా పెడుతాం.. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, గనుల శాఖ ఏడీ



# హెచ్ సిటీపై రివర్స్ గేర్..!

**నిలిచిన కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్ల పనులు**

**టెండర్ల దశలోనే వెనక్కి తగ్గిన అధికారులు**

సిటీబ్యూరో, జనవరి 7(నమస్తే తెలంగాణ) : పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆదిలోనే కేబీఆర్ ప్రాజెక్టు రివర్స్ గేర్‌లోకి మళ్లింది. టెండర్ల దశలోనే అధికారులు వెనక్కి తగ్గారు. ఇందుకు భూసేకరణ ప్రధాన కారణమని అధికార వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో రూ. 1090 కోట్లతో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులకు గత నెలలో జరిగిన ప్రజా పాలన ఏడాది విజయోత్సవ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే టెండర్ల దశను ముగించి అర్హత గల ఏజెన్సీతో పనులు ప్రారంభించాల్సిన అధికారులు భూసేకరణపై స్పష్టత వచ్చాకనే టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ విభాగం నిర్ణయించింది. దీంతో ఈ ప్రాజెక్టు ఇప్పట్లో పట్టాలెక్కడం కష్టసాధ్యమేనన్న చర్చ లేకపోలేదు.

**భూసేకరణే అసలైన పరీక్ష**

హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ వాహనాల రద్దీ నియంత్రణ, వాహనదారులు తేలిగ్గా ముందుకు సాగేందుకు వీలుగా ప్రభుత్వం ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల్లో అత్యంత క్లిష్టమైనది భూ సేకరణ ప్రక్రియ..అయితే ఈ ప్రాజెక్టు విషయంలో క్లారిటీ లేకుండానే హడావుడి చేసి ప్రస్తుతం అటకెక్కించారు. ప్రస్తుతం పాత రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్(ఆర్‌డీపీ) పరిగణనలోకి తీసుకుని కొత్త ఆర్‌డీపీ ప్లాన్ సిద్ధం చేశారు. గత ఆర్‌డీపీలో దాదాపుగా 86 నివాసాలు ఉన్నట్లు తేలింది. అయితే ఈ నివాసాల నుంచి ఆస్తుల స్వాధీనం అధికారులకు సవాల్‌గా మారింది.

**ప్రముఖుల ఇండ్లు..**

బంజారాహిల్స్ రోడ్ నం. 12 నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు భూసేకరణలో భాగంగా గతంలోనే పలు భవనాలను మార్కింగ్ వేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నం 92లో నివసించే మాజీ మంత్రి జానారెడ్డి రోడ్డు విస్తరణలో భాగంగా తన ప్లాట్ నుంచి 600 గజాల స్థలాన్ని కోల్పోనున్నారు. ఇక జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో ఉన్న హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటికి కూడా మార్కింగ్ వేశారు. సుమారుగా తన ప్లాట్‌లో 500 గజాల వరకు కోల్పోనున్నారు. మాజీ మంత్రులు సమరసింహారెడ్డి, షబ్బీర్ అలీ, కేఈ కృష్ణమూర్తి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, హీరో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి తదితర ఇండ్లకు కూడా మార్కింగ్ వేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12 విరంచి ఆసుపత్రి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు ప్రస్తుతం 80 అడుగుల రోడ్డు ఉంది. దీనిని 100 అడుగుల మేర విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు రెండు వైపులా ఆస్తులను సేకరించాలని నిర్ణయించారు. 86 నివాసాలకు మార్కింగ్ చేశారు.

**"హైదరాబాద్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. సర్కారు సరైన చర్యలు చేపట్టకపోవడంతో ప్రధాన కూడళ్లలో నిత్యం భారీగా ట్రాఫిక్ స్తంభిస్తున్నది. మంగళవారం రాయదుర్గం మార్గంలో కనిపించిన దృశ్యమిది.**

**ప్రాజెక్టు విశేషాలు**

కేబీఆర్ పార్కు చుట్టూ అగ్రసేన్, ఫిలింనగర్, క్యాన్సర్ హాస్పిటల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ఇలా ఆరు జంక్షన్లు ఉన్నాయి. ఈ ఆరు జంక్షన్లలో 8 స్టీల్ బ్రిడ్జిలు, ఆరు అండర్‌పాస్‌ల నిర్మాణం జరగనుంది. జూబ్లీహిల్స్ జంక్షన్, కేబీఆర్ ఎంట్రన్స్ జంక్షన్ వద్ద రెండు చొప్పున నాలుగు స్టీల్ బ్రిడ్జిలు రానున్నాయి. మిగతా నాలుగు జంక్షన్ల వద్ద ఒక్కో స్టీల్ బ్రిడ్జి, ఆరు జంక్షన్ల వద్ద ఒక్కొక్కటి చొప్పున ఆరు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. చిరంజీవి బ్లడ్ బ్యాంకు నుంచి రోడ్డు నెంబరు 45 వైపు వచ్చే ఫ్లై ఓవర్‌పై భాగంలో రెండు లేన్లతో రానుంది. కేబీఆర్ పార్కు నుంచి రోడ్ 36 వైపు వెళ్లే నాలుగు లేన్ల కింద నుంచి వెళ్లనుంది. ఈ నిర్మాణాలతో కేబీఆర్ పార్కు గ్రీనరీపై ప్రభావం పడుతుందని గతంలో పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించాయి. ప్రస్తుతం సైతం పర్యావరణ వేత్తలు కొందరు ఎన్జీటీకి వెళ్లే అస్కారం కూడా లేకపోలేదు.



# రియల్ బూమ్ ఉంటే.. అప్పులెందుకు?

**అభివృద్ధి పనులకు హెచ్ఎండీఏ రూ. 20వేల కోట్ల అప్పులు**

సిటీబ్యూరో: ఒకప్పుడు సొంత నిధులతో ప్రాజెక్టులు చేపట్టిన పరిస్థితి. అంతేకాదు.. కొత్త ప్రాజెక్టులకు ఇతర శాఖలకు నిధులను సమకూర్చిన ఘనత. కానీ ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోవడంతో.. సొంత ప్రాజెక్టులను చేపట్టేందుకు హెచ్ఎండీఏ నిధులను అన్వేషిస్తున్నది. ప్రాజెక్టులను వేగంగా పట్టాలెక్కించాలంటే ఆర్థిక వనరులు అడ్డు తగులుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ చేపట్టిన భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అప్పులు చేసేందుకు సిద్ధమవుతున్నది. ఇక ప్రభుత్వం నిధులిచ్చే పరిస్థితి లేకపోవడంతో.. రూ. 20వేల కోట్లను అప్పుల రూపంలో సేకరించేందుకు సిద్ధమవుతున్నది.

**అప్పుల కోసం వెంపర్లాట..**

ఇటీవల కాలంలో హెచ్ఎండీఏకు వచ్చే ప్రధాన ఆదాయ మార్గాలైన భవన నిర్మాణ అనుమతులు. వీటి ద్వారా మెజార్టీ రెవెన్యూ సమకూరేది. ప్లానింగ్ విభాగం సేకరించే నిధులకు అదనంగా భూముల వేలం, డెవలప్‌మెంట్ యాక్టివిటీతో హెచ్ఎండీఏ ఖజానా నిండేది. కానీ పరిస్థితి తలకిందులైంది. వచ్చే ఆదాయం ఏకంగా 50 శాతానికి తగ్గింది. దీంతో నెలవారీ నిర్వహణ, జీతభత్యాలు మినహా కొత్త ప్రాజెక్టులను చేపట్టాలంటే గల్లపెట్టే ఖాళీగా ఉంది. ముఖ్యంగా ప్రతిపాదిత ప్రాజెక్టులను కూడా పూర్తి స్థాయిలో కార్యరూపంలోకి తీసుకు రాలేకపోతున్నారు. మైనర్ పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నా.. నిధుల కొరతతో పూర్తి స్థాయిలో పనులు చేపట్టే అవకాశం లేక అప్పులు కోసం హెచ్ఎండీఏ సిద్ధమవుతున్నది.ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంగా గుర్తించే స్థాయిలో ఏ ఒక్క ప్రాజెక్టును చేపట్టలేదు. కనీసం శంకుస్థాపన చేసిన రెండు ఎలివేటెడ్ కారిడార్ పనులను కూడా ఇప్పటివరకు పట్టాలెక్కించలేదు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం భూసేకరణతో కలిపి మొత్తం రూ. 10వేల కోట్లు దాటుతుండగా.. మరో రూ. 10 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ నిధుల్లేక పనులు ఇంకా కొనసాగతూనే ఉన్నాయి. మరోవైపు మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం అంటూ హడావుడి చేసినా.. ఇంక పనులే మొదలు కాలేదు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ఫోర్త్ సిటీ, రీజినల్ రింగు రోడ్డును అనుసంధానం చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవేల అదనంగా సుమారు మరో రూ. 5వేల కోట్లు ఖర్చు చేస్తే గానీ ప్రాజెక్టు పూర్తి చేసే పరిస్థితి లేదు.

**నిధులు లేక..**

నిజానికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ కుప్పకూలిందనే వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పాలనాపరమైన విధానాలతో అమ్మకాలు పడిపోయాయి. కానీ హెచ్ఎండీఏ పరిధిలో అనుమతులు జోరుగా సాగుతున్నాయని, గతేడాది కంటే ఎక్కువ శాతం అనుమతులు ఇస్తున్నామని, రెవెన్యూ కూడా పెరిగిందంటూ వ్యాఖ్యానించింది. కానీ ప్రాజెక్టులను చేపట్టేందుకు నిధులు లేక అప్పుల కోసం సిద్ధం కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**గతమెంతో ఘనం..**

నిజానికి గడిచిన పదేండ్లలో హెచ్ఎండీఏ నిధుల కోసం ఏనాడు అప్పుల కోసం చేయి చాపలేదు. ట్యాంక్ బండ్ సుందరీకరణ, కొత్వాల్ గూడ ఎకో పార్క్, ఓఆర్ఆర్ వెంబడి సైకిల్ ట్రాక్, రేడియల్, లింకు రోడ్ల నిర్మాణం, వరల్డ్ క్లాస్ ప్రమాణాలతో కోకాపేట లే అవుట్ అభివృద్ధి వంటి అనే ప్రాజెక్టులను చేపట్టింది. గడిచిన పదేండ్లలో ఏకంగా రూ. 15వేల కోట్లకు పైగా నిధులను హెచ్ఎండీఏ ఖర్చు చేసి ప్రాజెక్టులను చేపట్టింది. రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు రూ. 450 కోట్లు నిధులను హెచ్ఎంఆర్ఎల్‌కు సమకూర్చేంత స్థాయిలో ముందుకు సాగింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కొత్త ప్రాజెక్టులను చేపట్టలేక నిధుల కోసం అప్పులు చేసే పరిస్థితికి హెచ్ఎండీఏ దిగజారింది.

## గాంధీలో ఐసొలేషన్ వార్డులు

బన్సీలాల్‌పేట్: హెచ్ఎంపీవీ వైరస్ బాధితులకు వైద్య సేవలు, చికిత్స అందించేందుకు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానలో ప్రత్యేకంగా 40 పడకలతో ఐసొలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎన్. రాజకుమారి తెలిపారు. వివిధ శాఖల హెచ్ఓడీలు డాక్టర్లు కృష్ణమూర్తి, సునీల్‌కుమార్, వాసుదేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రిలతో ఆమె మంగళవారం సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు.

